

కళ్లు మెరిసే పసిడి.. గుండె పిండే ధర..

- రూ.లక్షకు చేరువలో తులం బంగారం

నిజామాబాద్, జూలై22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బంగారం ధర భగభగ మండుతోంది. మధ్య తరగతి ప్రజలు బంగారం కొనుగోలు చేసేందుకు భయపడే స్థాయికి బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు బంగారం కొనుగోలు చేసేందుకు ఆలోచన చేయాలంటేనే భయపడే స్థాయికి కనకం రేటు దూసుకెళ్తోంది. ఇప్పటికే తులం బంగారం ధర రూ. లక్షకు చేరువ కాగా రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. రాబోయే శ్రావణమాసంలో పెళ్లిళ్లు పెట్టుకున్న సామాన్య మధ్య తరగతి వారు బంగారం ధర తులం రూ.లక్ష దాటడంతో ఆందోళన చెందుతున్నారు. బంగారం ధరలు పెరిగిపోవడంతో వ్యాపారాలు సైతం కావడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఆషాడంలో ఎవరూ బంగారం కొనుగోలు చేయకపోగా శ్రావణ మాసంలోనైనా బంగారం కొనుగోలు చేస్తారనుకున్న తరుణంలో బంగారం ధరలు పెరగడంపై వ్యాపారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మంగళవారం 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ.99,800 లు ఉండగా, 22 క్యారెట్ల ఆర్నమెంట్ బంగారం ధర రూ.92,130గా ఉన్నాయి. కాగా వెండి ధరలు కూడా పెరిగాయి. తులం వెండి ధర రూ.1,175 ఉంది.

కరెంట్ కోతలతో ఇబ్బందులు

- కోతలు లేకుండా చూడాలంటున్న ప్రజలు

7

జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రభుత్వం స్థానిక సంస్థలకు షెడ్యూల్ ప్రకటించక ముందే.. రిజర్వేషన్లు ఖరారు చేయక ముందే ప్రధాన పార్టీల నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు.
పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టి కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు.
గ్రామ పంచాయతీ, మండల, జడ్పీ, మున్సిపాలిటీలపై దృష్టి పెట్టి కార్యక్రమాలు చేపడుతున్నారు.
ఇప్పటి నుంచే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు.



పల్లెల్లో రాజకీయ సందడి

- స్థానిక సంస్థల షెడ్యూల్ ప్రకటించకముందే పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం
- గ్రామ, మండల స్థాయిలో ఆశావహుల కార్యక్రమాలు
- ఓటర్ల మెప్పు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు
- సర్వేల పేరుతో ఓటర్ల అభిప్రాయాల సేకరణ
- ఎన్నికల ప్రచార సామగ్రి ఏర్పాట్లలో ఆశావహులు
- గ్రామాల్లో మొదలైన విందు రాజకీయాలు
- పలుకుబడి ఉన్న వారిని మచ్చిక చేసుకుకేందుకు ప్రయత్నాలు

నిజామాబాద్ జూలై 22: (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే పల్లెల్లో రాజకీయ సందడి మొదలైంది. ఈ నెల చివరి వారంలో లేదా వచ్చే నెల మొదటి వారంలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు ఉండడంతో ఆశావహులు ఇప్పటి నుంచే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కొంత మంది ఆశావహులు కొంతమంది సిబ్బందిని నియమించుకొని సర్వేల పేరుతో ఓటర్ల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. సర్వేలలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగ తమ కార్యాచరణను సిద్ధం చేసుకుంటూ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. రాబోయే పండుగలకు అన్ని ఖర్చులు తామే భరించేలా గ్రామస్తుల మెప్పు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు గ్రామాలల్లో రాబోయే నాగుల చవితి, వినాయక చవితి, కృష్ణాష్టమి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏదో రకంగా సహాయపడుతూ ఓటర్ల మన్ననలు పొందేందుకు ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు.

వ్యక్తిగత గుర్తింపునకే ప్రాధాన్యం

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికలు వ్యక్తిగత గుర్తింపు వల్లే గెలిచే అవకాశాలు ఎక్కువ కావడంతో ఆశావహులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తూనే గ్రామాల్లో సాయం అడిగిన వారికి చేస్తున్నారు. ఇప్పటి నుంచే యువతను, మహిళలను మచ్చిక చేసుకుకేందుకు ఆశావహులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. యువతకు క్రికెట్ కిట్లు, ఇతర క్రీడా పరికరాలు అందజేయడం, మహిళలను ఆకట్టుకునేలా పలు కార్యక్రమాలను చేపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత, మహిళల ఓట్లే కీలకం కానుండగా వారిని ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు ఉన్నారు. జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీలలో ఇప్పటి నుంచే విందు రాజకీయాలు మొదలైనట్లు తెలుస్తోంది. కులాల వారీగా, సామాజిక వర్గాల వారీగా పలుకుబడి ఉన్న వారిని మచ్చిక చేసుకుకేందుకు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలలో ఇప్పటికే లక్షాలది రూపాయలు ఆశావహులు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లను బట్టి ఆశావహులు తమ సతీమణులను సైతం పోటీలో ఉంచేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఆషాఢ మాసంలో వనభోజనాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటి నుంచే ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ఆశావహులు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ప్రచార సామగ్రిని, తమ పేరుపై ప్రత్యేక గీతాలను, పోస్టర్లను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకునే పనిలో ఆశావహులు ఉన్నారు. ఎలాగైనా ఎన్నికలలలో గెలవాలనుకుంటున్న ఆశావాహులు ఖర్చుకు సైతం వెనకాడడం లేదు. ఎన్నికల కోసం అన్ని విధాలుగా ఇప్పటి నుంచే వనరులను సిద్ధం చేసుకుంటున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థిని సబ్జెక్టులోని ప్రశ్నలను అడుగుతున్న కలెక్టర్

భోజనం రుచికరంగా ఉంటుందా?

- అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా..
- చదువే ఆయుధంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- కంజర జ్యోతిబా పూలే పాఠశాల తనిఖీలో కలెక్టర్

మోపాల్ జూలై 22: (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంజర గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, బాత్ రూంలు, లైబ్రరీ తదితర వాటిని పరిశీలించారు. పిల్లలు ఆరు బయట భోజనం చేస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, పాఠశాల ప్రిన్సిపాల్ మురళిని ఈ విషయమై ప్రశ్నించారు. అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన డార్మెటరీ బ్లాక్ అందుబాటులో ఉన్నప్పటికీ ఆరు బయట భోజనం ఎందుకు పెడుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే భవనం ఇంకా తమకు అప్పగించలేదని ప్రిన్సిపాల్ తెలపగా, ప్రాంతీయ సమన్వయకర్త (ఆర్సీఓ)ను కలెక్టర్ ఫోన్‌లో సంప్రదించి, నూతన డార్మెటరీ బ్లాక్ విషయమై ప్రశ్నించారు. రేపటిలోగా భవనం ఆధీనంలో తీసుకోవాలని ఆదేశించారు. పాత బాత్ రూం అస్తవ్యస్తంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, డార్మెటరీ బ్లాక్‌లోని బాత్ రూమ్‌లను విద్యార్థులు వినియోగించేలా చూడాలన్నారు. కాగా, డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించి, విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూలో సూచించిన కూరగాయలకు బదులు ఇతర కూరగాయలతో కర్రీ వండడం పట్ల నిర్వాహకులను నిలదీశారు. డైట్ ప్లాన్‌ను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహణను చక్కదిద్దాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కాగా, పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ అయ్యాయా అని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ 9వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అన్ని సబ్జెక్టుల పుస్తకాలు ఇచ్చారా అని పిల్లలను ప్రశ్నించగా, పర్యావరణం సబ్జెక్టు పుస్తకం పంపిణీ కాలేదని తెలిపారు. దీంతో కలెక్టర్

మిగతా 8వ పేజీలో...


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

- లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉంచాలి
- వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి
- వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

8



కలువల కాంతిలో.. చెరువు చిగురింత...



రోడ్డు పక్కన ఉన్న చెరువులో రంగురంగుల కలువ పూలు కనువిందు చేస్తున్నాయి. నిజామాబాద్ రూరల్ మండలం మండలం కాలూర్ శివారులోని తోట్లకుంటలో తెలుగు, గులాబీ రంగు, నీలిరంగుల్లో ఉన్న కల్వ పువ్వులు విరబూసాయి. తెలుపు, గులాబీ, నీలం రంగుల కలువలు నీటిమీద తేలుతూ అందంగా మెరిసిపోతున్నాయి. ఈ దృశ్యం అటుగా వెళ్లే వారి దృష్టిని ఆకర్షిస్తూ వారిని ఆపేస్తోంది. పూల మధ్య విహరిస్తున్న తేనెటీగలు, నీటిపై పడిన ప్రతిబింబాలు మాయానుసంధానంగా కనిపిస్తున్నాయి. ఉదయాన్నీ, సాయంత్రాన్నీ ఈ చెరువు కొత్త రంగులలో ముంచెత్తుతుంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



అన్నదాత చూపు ఆకాశం వైపు

రైతుల కోసం కంట్రోల్ రూం

- జిల్లాలో పూర్తి స్థాయిలో కురవని వర్షాలు
- ఎండుతున్న పంటలు
- రోజురోజుకూ తగ్గుతున్న భూగర్భజలాలు
- ఎత్తిపోతున్న బోరుబావులు
- వర్షాల కోసం రైతుల ఎదురు చూపులు

సుభాష్‌నగర్: ప్రస్తుత వర్షాకాలంలో జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08462-220183కు సమాచారం అందించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తుందన్నారు.

నిజామాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలం మొదలై సుమారు రెండు నెలలు గడుస్తున్నా జిల్లాలో మాత్రం పూర్తి స్థాయిలో వర్షాలు కురవక అన్నదాతలు ఆకాశం వైపు చూస్తున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్న జిల్లా రైతాంగం వర్షాలు కురవక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. అడపదడపా జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నా భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు ఇంకా పూర్తిస్థాయిలో పంటలు వేయలేదు. ముందస్తు వర్షాలతో మేనెలలో వేసిన వరి పంట సైతం వర్షాలు కురవక పోవడంతో ఎండిపోయే పరిస్థితి ఉంది. ముందస్తుగా మురిపించిన రుతుపవనాలు ఆ తర్వాత కనుమరుగు కావడంతో జిల్లాలో ఖరీఫ్ సాగు ఆశించిన మేరకు సాగడం లేదు. జూన్ నెలలో వర్షాలు కురవక పోగా జూలైలో నైనా వర్షాలు కురుస్తాయని ఆశపడ్డ రైతంగానికి నిరాశ తప్పలేదు. జూలై నెల ప్రారంభమై 22 రోజులు గడుస్తున్నా జిల్లా లో భారీ వర్షాలు మాత్రం కురవలేదు. జిల్లాలోని 28 మండలాల్లో ఇప్పటి వరకు లోటు నమోదు కాగా 4 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లా లో ఇప్పటి వరకు 351.1 మీల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా మంగళవారం వరకు 235.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు 115.9 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది.

నాలుగు మండలాల్లో సాధారణం 29 మండలాల్లో లోటు వర్షపాతం

జిల్లాలో వానాకాలం సాగు ఆశించిన మేరకు సాగడం లేదు. మేలో ముందస్తు వర్షాలతో పంటల సాగు పూర్తయినా జూన్‌లో ఆశించిన మేర వర్షాలు కురవలేదు. బోరు బావుల వద్ద నాట్లు పూర్తయిన వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో అక్కడక్కడ వేసిన పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు సైతం తగ్గుతుండటంతో బోరు బావులు సైతం ఎత్తిపోతున్నాయి. జిల్లాలో 33 మండలాలు ఉండగా ఇప్పటి వరకు 4మండలాల్లో సాధారణ వర్షపాతం, మిగిలిన 29 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

4లక్షల 32వేల ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలో వర్షాకాలం 5లక్షల 48వేల 472 ఎకరాల్లో

మిగతా 8వ పేజీలో...



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరించాలి

- సీపీ సాయి చైతన్య

ధర్పపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరించి పోలీసు శాఖ ఇమేజ్ పెంచే విధంగా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని పోలీసు కమిషనర్ సాయి చైతన్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను సీపీ పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది స్టేషన్ పరిధిలో 24 గంటలు అందుబాటులో ఉండాలని సీపీ ఆదేశించారు. శాంతి భద్రతల కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇందులో ఏసీపీ రాజ వెంకట్ రెడ్డి, సీఐ భిక్షపతి, ఎస్సైలు కళ్యాణి, రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.



- మాస్టర్స్ చేయాలనుకునే వారికి అందుబాటులో టీజీ వర్సిటీ
- 6 కోర్సులతో ప్రారంభమై 31కోర్సులకు చేరిన ప్రాంగణం
- విశ్వవిద్యాలయంలో 18 రెగ్యులర్, 13 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు

'తెలంగాణ' పిలుస్తోంది..

డిచ్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని విద్యార్థులకు తెలంగాణ యూనివర్సిటీ పీజీ కోర్సులను అందిస్తోంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే 'సీపీగెట్' ప్రకటన విడుదలైన సందర్భంగా సమీపంలోని టీజీ వర్సిటీలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ యూనివర్సిటీ 2006 ఏడాదిలో 6 విభాగాలతో ప్రారంభమై ప్రస్తుతం 31 కోర్సులలో విస్తరించింది. ఇందులో 18 రెగ్యులర్ కోర్సులు, 13 సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ఉన్నాయి. వర్సిటీలో పార్మాసిటికల్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఫిజిక్స్‌తో పాటు ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్‌లలో తెలుగు, ఇంగ్లిష్, ఎకానమిక్స్‌లకు అధిక డిమాండ్ ఉంది. ఈ కామర్స్, కామర్స్‌లో సీట్లకు పోటీ ఎక్కువగా ఉంది. వర్సిటీకి భిక్కనూరు పీజీ సెంటర్, సారంగపూర్‌లో ఎడ్యుకేషన్ కళాశాల పాటు జిల్లా వ్యాప్తంగా 109 అనుబంధ కళాశాలలు ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో 60మంది రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తుండగా మరో 60మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో 15 మంది పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారు.

టీయూలో కోర్సులు ఇలా..

ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ స్టాటిటిక్స్, ఎంకాం, ఎంఏస్సీ జువాలజీ, ఎంఏ తెలుగు, ఎంఏస్‌డబ్ల్యూ, ఎంఏస్సీ బాటనీ, ఎంఏస్సీ బయోటెక్నాలజీ, మాథ్యమెటిక్స్ ఎంఏస్సీ ఫిజిక్స్ కోర్సులు అత్యధిక డిమాండ్లు ఉన్నాయి. ఇవే కాకుండా సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ఎంఏస్సీ మ్యాథమెటిక్స్, జువాలజీ, ఎంఏ పొలిటికల్

మిగతా 8వ పేజీలో...

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి

- ప్రతి కార్యకర్త పార్టీ కోసం సమష్టిగా పనిచేయాలి
- కార్యకర్తల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు

8

నిరుపేదలందరికీ రేషన్‌కార్డులు

- సన్నబియ్యాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుంటున్నారు
- రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం

6

గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ



తండాలో సీత్లా పండుగలో పాల్గొన్న తండా పెద్దలు

ఘనంగా సీత్లా పండుగ వేడుకలు

జక్రాన్‌పల్లి, జూలై22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివేక్‌నగర్ తండాలో సీత్లా పండుగను మంగళవారం తండా పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిన్నారులు, మహిళలు నైవేద్యాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం నైవేద్యాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వనభోజనాలకు వెళ్లారు. కార్యక్రమంలో తండాపెద్దలు శంకర్ నాయక్, మోజీరామ్, లక్‌వత్ మహిపాల్, రామనాయక్, రవి, జీవన్‌నాయక్, రామ్‌సింగ్, జితెందర్‌నాయక్, రాములు నాయక్ పాల్గొన్నారు.

పాముకాటు నివారణపై విద్యార్థులకు అవగాహన

కోటగిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం పాముకాటు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. భారత్ సిరమ్స్ అండ్ వ్యాక్సిన్స్, మ్యాన్ కైండ్ ఫార్మ లిమిటెడ్ ఆధ్వర్యంలో బాలకృష్ణ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పాముకాటు తర్వాత చేయాల్సినవి, చేయకూడనవి, ప్రథమ చికిత్స గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు బర్ల సాయిలు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ పాఠశాలలో మాక్ పోలింగ్

ముప్కాల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించే విధానంలో భాగంగా విద్యార్థులచే మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ తెలిపారు. సాధరణ ఎన్నికల మాదిరిగానే పకడ్బందిగా ఎన్నికల నిర్వహణకు రిటైర్నింగ్ అధికారులుగా, పీవోఏపీవో, ఓపీవో, పోలీస్‌లు, వైద్య సిబ్బంది తదితర సిబ్బందులను విద్యార్థులచే నిర్వహించారు. 300పైగా విద్యార్థులు ఓటు హక్కును నిర్వమించుకున్నారు. కార్యక్రమాన్ని ఆసక్తికరంగా నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి తహసీల్దార్ శ్రీధర్, ఎస్సై శైలేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు

ఆర్మూర్‌టౌన్, జూలై22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడవద్దని మున్సిపల్ అధికారి పూర్ణమౌళి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని 25, 36 వార్డుల్లో డ్రైనేజీలలో చెత్తను తొలగించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీధికుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, వార్డు ఆఫీసర్లు సింధుజ, జయలక్ష్మీ, సానీటరీ జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

భీమ్‌గల్‌రూరల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాంగ్రెస్‌ప్రభుత్వ లక్ష్యమని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మెండోర గ్రామంలో మహిళాశక్తి సంబురాలు, వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబం బాగుపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్ని పథకాలు మహిళల పేరుతో ప్రవేశపెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో భీమ్‌గల్, కమ్మర్‌పల్లి ఐకేపీ ఏపీఎంలు రవీందర్, గంగారెడ్డి, సీసీలు కుంట శ్రీనివాస్, నరేష్, మండల కాంగ్రెస్ నేతలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ కార్యకర్తలు సైనికులుగా పని చేయాలి'

మెండోర , జూలై22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని పార్టీ జిల్లా నాయకులు ముస్కు భూమేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలో బుస్సాపూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు మార ముత్యంరెడ్డి అధ్యక్షతన బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, కొమ్ముల రమేష్, రాజేష్, శ్రీకాంత్, సతీస్, ప్రసాద్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మల్, శాపూర్, రైతుపారం గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, మాజీ సర్పంచ్ మచ్చర్ల దంస గంగారాం అందజేశారు. నీరడినాగుకు రూ.14వేలు, ముప్పెడ శ్రీనివాస్‌కు రూ.60వేలు, వేమూరి సాంబకు రూ.20వేలు చెక్కులను ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం పంపిణీ చేశారు.

క్రైం సమాచారం

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

నవీపేట, జూలై22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అభంగపట్నంలో మంగళవారం దర్శనం అపూర్వ అలియాస్ ప్రవంతి (34) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అపూర్వ, సాయిబాబాలకు వివాహ మై 11 ఏళ్ల కాగా.. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఉదయం సాయిబాబా ప్రైవేటు ఉద్యోగానికి వెళ్లగా.. పిల్లలు స్కూల్ వెళ్లారు. మధ్యాహ్న సమయంలో అపూర్వ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదు. కేసు వివరాల కోసం ఎస్సై వినయ్ సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రెంజల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ మంగళవారం తెలిపారు. ఆదివారం రెంజల్ శివారులో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా కళ్యాపూర్, నీలా గ్రామాలకు చెందిన ఇద్దరు మద్యం తాగి వాహనం నడపడంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి శేషతల్ప సాయి ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి..

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి పీఎస్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో దొరికిన వ్యక్తికి రెండురోజులు జైలుశిక్ష విధించినట్లు మంగళవారం ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గ్రామానికి చెందిన గోపిచంద్‌కు ఆర్మూర్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి 2రోజుల జైలు శిక్ష విధించిచినట్లు ఎస్సై తెలిపారు.

డయల్ 100ను దుర్వినియోగం చేసిన కేసులో..

నవీపేట, జూలై22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడమ్మ కొండూర్ గ్రామానికి చెందిన బంగార్రాజుకు మంగళవారం ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. బంగార్రాజు ప్రతీ రోజు డయల్ 100కు కాల్ చేస్తూ, న్యూసెన్స్ చేయడంతో నందిపేట పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపర్చగా 5రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

బోధన్‌లో మరో నలుగురికి ఒక రోజు జైలు శిక్ష

బోధన్: బోధన్ పట్టణంలో మద్యంతాగి వాహనాలు నడిపిన చిక్కుడ్‌పల్లి గ్రామానికి చెందిన శేఖర్, పెగడాపల్లికి చెందిన శ్రీరామ్ వెంకటేష్‌ర్మలకు న్యాయాధికారి రెండురోజుల జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. శక్కర్‌నగర్ కాలనీకి చెందిన షేక్ అయుబ్, నీల వినోద్ ఇద్దరు కలిసి మద్యం తాగి డయల్ 100కు పలుమార్లు ఫోన్‌చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసినందుకు వారికి ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు వెల్లడించారు.

త్వరలోనే ఆర్మూర్‌లో సీఎం పర్యటన: ఎమ్మెల్యే

ఆర్మూర్, జూలై22 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారని, సీఎం పర్యటనతో నియోజకవర్గానికి పెద్దమొత్తంలో లబ్ధిచేకూరుతుందని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో నూతన ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల నిర్మాణానికి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మంగళవారం ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి అధికారులతో కలిసి భూమిని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం పరిసరాలు, ఆర్డీవో కార్యాలయ ఆవరణలో గల భూమిని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల తాను నూతన ప్రభుత్వభూములు, కొత్తగా చేసిన వెంచర్లలో పదిశాతం భూమిని మాత్రమే గుర్తించి బోర్డులు పెట్టాలని చెప్పామన్నారు. ప్రజలను రెచ్చగొట్టడానికి కొందరు రాజకీయ నాయకులు అపోహలు సృష్టిస్తున్నారన్నారు. గతంలో పదిశాతం భూమిలో వివిధ కుల సంఘాలకు కేటాయించిన భూమిలో బోర్డులు పెట్టాలని తాను చెప్పలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం గందరగోళం చేస్తున్నారన్నారు. ఆర్మూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మొరం ఉచితంగా అందజేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలువడం ఖాయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో జడ్పీని కైవసం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాల్ల రాజ్‌కుమార్, సాంధన్న, కలిగోట గంగాధర్, మందుల బాలు, జాగీర్ధర్ శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అధికారులతో సమీక్ష సమావేశం

అధికారులతో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులు త్వరలోనే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజు, డిప్యూటి తహసీల్దార్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిస కావద్దు: ఎస్సై

ముప్కాల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని బాల్కొండ ఎస్సై శైలేందర్ అన్నారు. మంగళవారం బాల్కొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ కళాబృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్య నేరమన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బట్టు రాజేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బోధన్: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం పట్టణ సీఐ వెంకట నారాయణ డ్రగ్స్ ర్యాగింగ్ వ్యతిరేక, ట్రాఫిక్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తుపదార్థాలను అలవాటు చేసుకోవద్దని అన్నారు. ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌తోపాటు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు అచ్యుతానందన్

వర్ని, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ కమ్యూనిస్టు, కేరళ మాజీ సీఎం కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. వర్ని మండల కేంద్రంలో మంగళవారం కామ్రేడ్ అచ్యుతానందన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, లింగం, మారయ్య, భూమయ్య, గంగారాం, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తెచ్చిన కవి దాశరథి

డొంకేశ్వర్, జూలై22 (ఆంధ్రజ్యోతి): నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ గొంతెత్తి పాడి తెలంగాణ ప్రజల్లో చైనత్యం తెచ్చిన కవి దాశరథి కృష్ణమాచార్యులని డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, వెంకటరమణచారి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, మహేష్‌కుమార్, సాగర్, రవి, తదితరుల ఉపాల్గొన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ

బోధన్,జూలై22(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని అన్ని వార్డులలో దోమల నివారణ కోసం ప్రతీరోజు వార్డుల వారిగా దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని వార్డు నెంబర్ 32 మాజీ కౌన్సిలర్ ఇమ్రాన్ షరీఫ్‌తో కలిసి వార్డులో పర్యటించారు.

దగ్గు ఒక్కటే టీబీ లక్షణం కాదు

రుద్రూరు,జూలై22(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధికి దగ్గు ఒక్కటే లక్షణం కాదని ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్ అన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో ఏఎస్‌సీ కాలనీలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. 50మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 11 మందికి జిల్లాఆసుపత్రి బోధన్‌కు తరలించారు. టీబీకి దగ్గు ఒక్కటే లక్షణం కాదని ఛాతినొప్పి, మెడపక్కన చెమట, వంటివి టీబీ లక్షణాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రవి, సుమతి, అర్షద్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఏసీపీ

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

బోధన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు నాటి వాటిని సంరక్షించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బోధన్ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. పోలీసు సిబ్బంది సైతం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎస్ఐ అబీబ్, మచ్చేందర్‌రెడ్డి తదితరులున్నారు. అలాగే బోధన్ పట్టణంలోని విజయమేరి పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, మున్సిపల్ అధికారులు విజయమేరి ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్, టీచర్ మమతలు పాఠశాల ప్రాంగణంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎంఈవో నాగయ్య మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

లక్ష్మీకాల్వ ద్వారా నీరు విడుదల చేయాలి : బాల్కొండ ఎమ్మెల్యే

ముప్కాల్, జూలై22(ఆంధ్రజ్యోతి): లక్ష్మీ కాల్వ ఆయకట్టు రైతుల డిమాండ్ మేరకు నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌ను కోరారు. వర్షాలు లేని కారణంగా ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు.

గంగపుత్ర సంఘం భవనానికి నిధులు కేటాయించాలని వినతి

ఆలూర్, జూలై22 (ఆంధ్రజ్యోతి): ఆలూర్‌కు చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని మంగళవారం అంకాపూర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గంగమ్మతల్లి ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందించి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.

మోడల్ సోలార్ గ్రామంగా ముప్కాల్

ముప్కాల్, జూలై22 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యగర్ ముక్త బిజిలి యోజన పథకానికి ముప్కాల్ గ్రామం ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి మల్లేష్ యాదవ్ మంగళవారం తెలిపారు. ప్రతీ జిల్లాకు 30గ్రామాలను మోడల్ సోలార్ గ్రామంగా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంలో భాగంగా ముప్కాల్ గ్రామం ఎంపిక కావడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

బోధన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని విజయసాయి ఉన్నతపాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్టు సుబీర్ సంద్ర విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదని, వారికి విలువలు నేర్పాలని సూచించారు. పిల్లలు డబ్బు విలువతెలిసి రావాలంటే చిన్నప్పటి నుంచే మార్కెట్ చేయడం నేర్పాలన్నారు. పిల్లల ప్రవర్తనలో సెల్‌ఫోన్ ద్వారా వచ్చే దుష్ప్రభావాలు, ప్రమాదాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, ఐఆర్ చక్రవర్తి, సువర్చల, ప్రసూన, ప్రధానోపాధ్యాయురాలు కల్పన, రాజశేఖర్, లయన్స్ ప్రతినిధులు శ్రీనివాస రాజు, రామకృష్ణ, పావులూరి వెంకటేశ్వర్ రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ రేషన్‌కార్డులు

● రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం

వర్ని, జూలై22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలందరికీ రేషన్ కార్డులు అందిస్తోందని ప్రభుత్వం వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వర్ని మండలకేంద్రంలో మంగళవారం వర్ని, కోటగిరి, పొతంగల్, రుద్రూరు, మోస్రా, చందూర్ మండలాల పరిధిలోని 1699 మందికి కొత్త రేషన్‌కార్డులను అందజేశారు. ఆస్తులు కలిగి ఉన్నవారు తమ వద్దగల రేషన్‌కార్డులను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలని కోరారు. గతంలో దొడ్డు బియ్యానికి బ్లాక్‌లో అమ్ముకునే వారని, ప్రస్తుతం సన్నబియ్యాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. గతంలో ప్రతీఒక్కరికి ఇల్లు అవసరమని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఎస్‌వో అరవింద్, నాయకులు భారి, సాయిబాబా, గోపాల్, గిరి, తహసీల్దార్ సాయిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోచారం

స్థానిక సంస్థలకు సన్నద్ధం కావాలి

నవీపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని, పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్థానిక సంస్థల ఎన్నికల బీజేపీ జిల్లా కన్వీనర్ వీ.మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పోతంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వానాకాలం సాగుకు సంబంధించి నిజాంసాగర్ నీటిని డీ50 ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టుకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని నాళేశ్వర్ మాజీ ఎంపీటీసీ కారడి లక్ష్మణ్ బీజేపీలో చేరగా ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, శ్రీధర్, శైలేష్ కుమార్, ఆనంద్, శ్రీకాంత్, రాజేందర్ గౌడ్, నీరడి భూషణ్, బూనాది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం

బోధన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వల కొరత ఉందని మంగళవారం హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు చిత్రాల ప్రమోద్‌తోపాటు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చిత్రాల ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లక్‌బ్యాంక్ సిబ్బంది, డాక్టర్ సుమంత్, సిబ్బంది తదితరులున్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల పొలంబాట

నవీపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరిలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట పట్టారు. విద్యుత్‌శాఖ రైతు పొలంబాట కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామంలో పర్యటించి రైతుల నుంచి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ బోర్ల వద్ద కెపాసిటర్లను అమర్చుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, జన్నేపల్లి ఏఈ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించాలి

బోధన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ వ్యక్తిగత, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని బోధన్ ఎంపీడీవో బాలగంగాధర్ అన్నారు. మంగళవారం రాజీవ్‌నగర్ తండాలో డెంగ్యూ కేసు నమోదైన వ్యక్తి ఇంటి చుట్టూ స్ప్రే చేయించినట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు హెల్త్‌క్యాంప్ నిర్వహించామన్నారు. దోమలు, ఇతర కీటకాలు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆయనవెంట ఎంపీవో మధుకర్, మెడికల్ ఆఫీసర్ జవిరా, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్ తండాలో స్ప్రే చేస్తున్న దృశ్యం

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయ అధికారి మేకల గోవింద్

కోటగిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవడంతోపాటు డీలర్‌షిప్‌లను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి మేకల గోవింద్ హెచ్చరించారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో మంగళవారం ప్రైవేటు ఫర్టిలైజర్ షాప్‌లు, సహకార సంఘాల్లో ఎరువుల స్టాక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎరువుల కొరత లేదన్నారు. రైతులు అవసరం మేరకు ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. పలు షాపుల్లో ఫర్టిలైజర్ స్టాక్ బోర్డులను, స్టాక్ రిజిష్టర్లను, బిల్ బుక్స్ పరిశీలించారు. కోటగిరి మండలంలో 125మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. పొతంగల్‌లో 26మెట్రిక్ టన్నులయూరియా, 24.35మెట్రిక్ టన్నుల డీఏపీ, 12.85మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 97.35మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయనవెంట వ్యవసాయ అధికారులు రాజు, నిశిత, ఏఈవోలు సందీప్, గౌస్, ఆస్మా బేగం తదితరులున్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ



కమ్మర్‌పల్లిలో బోనాల ఊరేగింపులో విద్యార్థినులు



వివిధ వేషధారణలో చిన్నారులు

జక్రాన్‌పల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్‌లో మాజీసర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గోర్తా రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం బోనాల పండుగను గ్రామస్థులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వర్షాలు బాగా కురవాలని, చెరువులు నిండి పంటలు పండాలని, పాడి పశువు, ప్రజలు ఆయురారోగ్యాలుగా ఉండాలని వేడుకుంటు గ్రామంలోని వివిధ ఆలయాలలో, పోచమ్మ ఆలయాలలో గ్రామ దేవతలకు గంగనీళ్లుపోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోర్తపద్మ, మాజీ సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, బాలుర పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతురాజుల వేషధారణతో అలరించగా విద్యార్థినీలు, ఉపాధ్యాయులు బోనాలు ఎత్తుకున్నారు. డప్పు వాయిద్యాలతో ముత్యాలమ్మకు బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల హెచ్ఎం వనజారెడ్డి, బాలుర పాఠశాల హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ఉన్నతపాఠశాలలో విద్యార్థులు మంగళవారం బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. బోనాలకు పాఠశాల హెచ్ఎం సాయన్న, ఉపాధ్యాయలు రాజేశ్వర్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య నాగభూషణం, మహిళా ఉపాధ్యాయులు పూజలు చేశారు. పెద్దమ్మ ఆలయంలో పెద్దమ్మతల్లికి బోనాలను సమర్పించారు.

పెర్కిట్ : ఆర్మూర్ పట్టణంలోని ఆత్రేయ పాఠశాలలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మాదురి బోనాల విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేష్, రవి, రాకేష్, లావణ్య, మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని కూనేపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా ఘనంగా బోనాల పండుగ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనంతో పోతరాజుల విన్యాసాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ, మాజీ సర్పంచ్ రొడ్డ విజయ లింగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు బాలికలు పోతరాజుల వేషధారణ ధరించి ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయినులు తలపై బోనాలను ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

బోధన్: బోధన్‌లో ఆరె కటికె సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కుల సంఘం మహిళలు బోనాలతో పెద్దమ్మ తల్లి, మహలక్ష్మి ఆలయం వరకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘ సభ్యులు గంగారాం చౌదరి, రాజులాల్, గోపి, సాయినాథ్, మహేష్, రాజేందర్, రాజేశ్వర్, గంగాలాల్, లాలు, కుల సంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

కోటగిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోనేరు చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కోటగిరి రచ్చగల్లీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉదయ్ చందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రచ్చగల్లీ పాఠశాలలో మంగళవారం కోనేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ 20మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులతో పాటు 80మంది విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉదయ్ చందర్, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, శ్రావణ్, కనీజ్ ఫాతిమా, ప్రీతి, బీజేపీ నాయకులు ప్రకాష్, శ్యామల, భూమయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ 33/11 సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల్లో భాగంగా ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

● ముజీబ్, తహసీల్దార్, మద్నూర్



కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని కార్డు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తరువాత ప్రభుత్వం నుంచి కొత్త రేషన్ కార్డు వస్తుందని మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: మండలంలో కొత్తగా ఎన్ని రేషన్ కార్డులు వచ్చాయి?

జవాబు: ఇప్పటి వరకు 795 కొత్త వారికి రేషన్ కార్డులు ప్రభుత్వం నుంచి వచ్చాయి.

ప్ర: రేషన్ కార్డు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలా?

జ: మీ సేవలో కొత్త రేషన్ కార్డు కావాలనుకున్న వారు దరఖాస్తు చేసుకోవాలి.

ప్ర: ఇప్పటి వరకు కొత్తగా ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు?

జ: మద్నూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి 217 మందికి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు.

ప్ర: రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు?

జ: భూ సమస్యల పరిష్కారం కోసం 771 మంది రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకున్నారు.

ప్ర: ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారు?

జ: మద్నూర్ మండలంలో సుమారు 259 దరఖాస్తులను ఇప్పటి వరకు పరిష్కరించాం. మిగతావి త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్ర: మీ సేవలో రైతులకు, విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత ఎన్ని రోజులకు సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు?

జ: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సమయానికి దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను జారీ చేస్తున్నాం.

● (మద్నూర్, ఆంధ్రజ్యోతి)

బాబల్‌గాం బాధలు

పట్టించుకోండి సారూ..



బాబల్‌గాం గ్రామ ముఖచిత్రం

- విలీన గ్రామంలో సమస్యలులెన్నో..
- పనులు కావాలంటే మూడు మండలాలకు వెళ్లాల్సిందే
- అన్ని శాఖలను కొడప్‌గల్‌లోకి తీసుకురావాలని వినతి

పెద్దకొడప్‌గల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాగా ఉన్న సమయంలో బాబల్‌గాం గ్రామం పేరెత్తితే అమ్మో ఆ ఊరికి నాటు పడవలో లేదా తెప్పపై వెళ్లాలి అని హడలిపోయేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఈ గ్రామానికి చింతల్‌వాడీ వైపు నుంచి వంతెన నిర్మించారు. దీంతో ప్రస్తుతం బాబల్‌గాం గ్రామస్థులు అంతా ఏ పనిమీద వెళ్లిన వంతెనపై నుండి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వంతెన నిర్మించేముందు బాబల్‌గాం గ్రామస్థులంతా ఏ పని ఉన్నా జుక్కల్ మండల కేంద్రానికి వెళ్లేవారు. ఈ గ్రామం జుక్కల్ మండలంలో ఉన్నందున ప్రజలు తమ అవసరాల కోసం జుక్కల్ వెళ్లి వచ్చేవారు. వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ గ్రామానికి కంగ్టి మండలం దగ్గర అవుతుందనే ఉద్దేశ్యంతో బాబల్‌గాంను అప్పట్లో గ్రామస్థుల నిర్ణయం మేరకు సంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారు. గత ఎన్నికల సమయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు సర్పంచ్ ఎన్నికల సమయంలో ఈ గ్రామస్థులంతా సంగారెడ్డి జిల్లాలోనే ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డి జిల్లాలో బాబల్‌గాంను విలీనం చేసినందున అన్ని శాఖలను సంగారెడ్డి జిల్లా నుంచే పర్యవేక్షణ జరిపేవారు. అయితే తర్వాత తర్వాత క్రమంలో ఈ గ్రామస్థులు తమకు సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తిరిగి తమను కామారెడ్డి జిల్లాలో కలపాలని అధికారులతో పాటు, ప్రజా ప్రతినిధులకు విన్నవించగా గత రెండు సంవత్సరాల కిందట తిరిగి బాబల్‌గాంను కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలంలో కలుపుతూ అధికారులు గెజిట్ జారీచేశారు. దీంతో బాబల్‌గాం గ్రామంతో పాటు దాని అనుబంధ గ్రామాలైన చింతల్‌వాడీ, చింతల్ వాడీ, హర్యానాయక్ తండాలు పెద్ద కొడప్‌గల్ మండలంలో చేరిపోయాయి. దీంతో జిల్లా అధికారులు ముందుగా రెవెన్యూ, ఉపాధి హామీ శాఖలను కొడప్‌గల్ మండలానికి అనుసంధానం చేశారు. మిగతా శాఖలు కంగ్టి మండలం నుంచే పర్యవేక్షించచేవారు. అటు పిమ్మట కొన్ని రోజుల తర్వాత విద్యాశాఖ, వ్యవసాయం తదితర శాఖలను కొడప్‌గల్ మండలానికి బదలాయించారు. ఇంక నేటికి మిగతా శాఖలు కంగ్టి మండలంలోనే ఉండటం వలన ఇబ్బందులు ఎదురౌతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

కంగ్టి మండలంలో నేటికి ఈ శాఖల పనులకు వెళ్లాల్సిందే

బాబల్‌గాం గ్రామస్థులు పెద్ద కొడప్‌గల్ మండలంలో చేరినప్పటికి పోలీస్, ఇందిరా కాంతి పథం, మాతా శిశు సంరక్షణ, వైద్యం, సహకార సంఘం, జనన మరణ ధ్రువ పత్రాల కోసం, బ్యాంకు పనుల నిమిత్తం వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు.

పెద్ద కొడప్‌గల్ మండలంలో ఈ శాఖల పనులకు వెళ్లాల్సిందే

పెద్ద కొడప్‌గల్ మండలం ఏర్పాటు అయిన తర్వాత బాబల్‌గాం గ్రామాన్ని విలీనం చేశారు. దీంతో ముందుగా రెవెన్యూ, ఉపాధి హామి శాఖలను చేర్చిన అధికారులు తరువాత రోజుల్లో విద్య, పంచాయతీ రాజ్, వ్యవసాయ రంగాలకు చెందిన శాఖలను చేర్చారు. దీంతో ఈ పనుల కోసం పెద్ద కొడప్‌గల్ మండలానికి రావాల్సిందే మరి. ఇటీవల ప్రభుత్వం రేషన్ కార్డులలో కొత్త సభ్యుల చేర్చడం వంటి ప్రక్రియను ప్రారంభిస్తే ఈ గ్రామస్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంక తమకు బాబల్‌గాం గ్రామం ఉన్నందున యాడింగ్ కావడం లేదని వాపోతున్నారు.

పలు శాఖలపై స్పష్టత కరవు..

రైతులకు సంబంధించిన సకాలంలో రుణాలు అందించడంతో పాటు, ఎరువులు అందించే సహకార సంఘ విషయంలో ఇంక స్పష్టత రాలేదు. గతంలో జుక్కల్ సహకార సంఘ పరిధిలో ఉండగా, అనంతరం కంగ్టి సహకార సంఘం సేవలందించింది. అనంతరం పెద్దకొడప్‌గల్‌కు మారిన తర్వాత ఇంక వీరు ఏ సహకార సంఘంలో ఉన్నారన్న దానిపై స్పష్టత రాలేదు. ఇక దీంతో పాటుగానే గతంలో కంగ్టి మండల కేంద్రంలోని బ్యాంకులలో రైతులకు రుణాలు ఉండగా, రుణ మాఫీ అయిన తర్వాత కంగ్టి బ్యాంక్ అధికారులు ఇక తమ పరిధిలో లేరంటూ రుణాలు ఇవ్వడం మానివేశారు.

అన్ని శాఖలకు కొడప్‌గల్ మండలంలోనే కొనసాగించాలి..

బాబల్‌గాం గ్రామంను పెద్ద కొడప్‌గల్ మండలంలోనే విలీనం చేసినందున తమ గ్రామానికి చెందిన ప్రజలకు అన్ని శాఖలను పెద్ద కొడప్‌గల్ మండలంలోనే కొనసాగించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.



బాబల్‌గాం గ్రామం చుట్టూ వ్యాపించిన కాలాస్‌నాలా

మా గ్రామం ప్రస్తుతం కొడప్‌గల్ మండలంలో చేరింది..

వీరా రెడ్డి, బాబల్‌గాం గ్రామస్థుడు



మా గ్రామం ఇప్పటి వరకు కంగ్టి మండలంలో ఉండగా, ప్రస్తుతం కొడప్‌గల్ మండలంలో చేరింది. దీంతో కొన్ని శాఖలు కంగ్టి మండలంలో మరి కొన్ని కొడప్‌గల్ మండలంలో ఉండటం వలన ఇబ్బందులు ఎదురవుతునాయి. అన్ని శాఖలను కొడప్‌గల్ మండలంలోనే ఉంచితే గ్రామస్థులకు మేలు జరుగుతుంది. లేదంటే ఇబ్బందుల పాలవుతాం.

మా గ్రామానికి భగీరథ నీరు రావడం లేదు..

- మోహన్ రెడ్డి, బాబల్‌గాం గ్రామస్థుడు



జుక్కల్ మండలంలో చూసిన, కొడప్‌గల్ మండలం నుంచి చూసినా, కంగ్టి మండలం నుంచి చూసినా బాబల్‌గాం మండల కేంద్రానికి చివరన ఉండటం వల్ల మిషన్ భగీరథ ప్రారంభం నుంచి మా గ్రామానికి భగీరథ నీరు రావడం లేదు. ఇప్పటికి ఇతర నీటి వనరులను వినియోగించుకుంటున్నాం. ఎన్ని సార్లు అధికారులకు భగీరథ నీరు రావడం లేదని ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి నిర్మాణ దారులకు కూడా నిన్నటి వరకు మండలంపై స్పష్టత లేనందున మంజూరు రాలేదు. గురువారం నుంచి కొడప్‌గల్ మండలం ద్వారా ఇళ్ల మంజూరు వచ్చింది.

అంబంలో అరుదైన చేప

- చూసేందుకు తరలివచ్చిన గ్రామస్థులు



అరుదైన మలుగు వాపెడ చేపను చూపిస్తున్న దృశ్యం

రుద్రూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చేపలు మాములుగా అయితే అడుగున్నర రెండు అడుగులు వరకు ఉండడం సహజం. అయితే ఏకంగా నాలుగు అడుగుల పొడవు వరకు ఉన్న చేప యువకులకు చిక్కింది. దానిని కొనేందుకు పోటీ పెరిగింది. ఏకంగా మూడు వేల రూపాయల వరకు ధర పలికింది. రుద్రూరు మండలంలోని అంబం(ఆర్) గ్రామ పంట పొలాల్లో మంగళవారం రైతు రసూల్ తన కౌలు పొలం వద్దకు వెళ్లాడు. ఒక్కసారిగా పొలంలోని గనుమా వద్ద కనిపించడంతో పాము అనుకుని భయపడ్డాడు. అరుదైన పొడవైన చేప మలుగు పాపెర చేతికి చిక్కింది. ఇంకేముంది ఆ చేపను చూసిన గ్రామస్థులు ఆశ్చర్యానికి లోనయ్యారు. చేపను చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. ఇక ఆ చేపను కొనేందుకు గ్రామస్థులు పోటీ పడ్డారు. గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈ చేపను 3వేల రూపాయల ధర చెల్లించి చేజిక్కించుకున్నాడు. ఇటువంటి చేపలు అరుదుగా దొరుకుతాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

రెసిడెన్షియల్ కళాశాలకు బాలికలు ఎంపిక కావడం అభినందనీయం

● ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకటేశం



ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నిజాంసాగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు బాలికలు తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు విద్యాభ్యాసం కోసం ఎంపిక కావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు ఎ. వెంకటేశం అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిజాంసాగర్‌లో ఎంపికైన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసేందుకు అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పాఠశాలలో 10వ తరగతి చదివి మే నెలలో తెలంగాణ రెసిడెన్షియల్ కళాశాల ప్రవేశ పరీక్షకు హాజరై 150 మార్కులకు గాను 67 మార్కులు బేగరి భానుప్రియ, 75 మార్కులు అజ్జం భానుప్రియ సాధించి ఎడపల్లిలోని రెసిడెన్షియల్ కళాశాలకు ఎంపికయ్యారు పాఠశాల ఉపాధ్యాయ బృందం బేగరి భానుప్రియ అజ్జం భానుప్రియలను ప్రశంసించారు. ఒక్కొక్కరికి 2500 నగదు ప్రోత్సాహక బహుమతి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం అందజేశారు. ఈ కార్యక్రమంలో వి.రక్షణకాంత్, పి. వెంకటి, రాములు, రాజేందర్, శైలజ సంఘమిత్ర తదితరులు ఉన్నారు.

అంటు వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

● వైద్యాధికారి డాక్టర్ సురేష్

రామారెడ్డి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంటువ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని రామారెడ్డి పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం పలు ప్రాంతాల్లో పరిసరాలను పరిశీలించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జార్జ్, ఎఎన్ఎం లింబమ్మ, ఆశ కార్యకర్తలు ప్రమీల, మంజుల, రజిత పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచాలి

● ఏడీఏ అరుణ



నసురుల్లాబాద్ గోదాంలో స్టాక్ వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ అరుణ

నసురుల్లాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచాలని ఏడీఏ అరుణ అన్నారు. మంగళవారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని సొసైటీ పరిధిలో గల గోదాంలో యూరియా స్టాక్ ఉందా లేదా అని సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాట్లు వేశాక రైతులకు యూరియా తప్పకుండా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ శాఖ అధికారిని భవాని, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఉన్న రెండో వార్డు బీసీ కాలనీలో నూతనంగా సీసీ రోడ్లు మురికి కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో పారిశుధ్యం ఎక్కడి చెత్త అక్కడ నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని. అదే విధంగా చిన్నపాటి వర్షం కురిస్తే నివాసల ఇంటి ముందు నీరు ఆగుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కాలనీవాసులు ఈ కార్యక్రమంలో మహేష్ నరేష్ తదితరులు ఉన్నారు.

కరెంట్ కోతలతో ఇబ్బందులు

● పలు కార్యాలయాల్లో స్థంభించిపోతున్న సేవలు



మద్నూర్ విద్యుత్ సబ్ స్టేషన్

మద్నూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ కోతలతో జనాలు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ సిబ్బంది అప్రకటిత కరెంటు కోతలు విధిస్తుండటంతో కార్యాలయాల్లో పనులు స్తంభించిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు, గాలి దుమారాలు వస్తుండడంతో కరెంటు సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. గత కొద్దిరోజులుగా అనధికార విద్యుత్ కోతలు మొదలు కావడంతో ప్రజలు ఇళ్లలో, కార్యాలయాలలో, వెల్డింగ్, టీవీ, మెకానికులు తదితర చిరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కరెంటు కోతల కారణంగా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వర్షాలు లేకపోగా కరెంటు లేక ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జనం కరెంటు కోతలతో మరింత ఇబ్బంది పడుతున్నారు.

● **చీటికి మాటికి పోతున్న కరెంట్**

కరెంటు ఎప్పుడు పోతుందో ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేక ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. బయటకు వెళ్లలేక ఇంట్లో ఉండలేక అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో కరెంటు పోయిన సమయంలో చిన్నారులు, వృద్ధులు, నిద్రపోవడం లేదు. కరెంట్ వచ్చేవరకు ప్రజలు జాగారం చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు రైతులు కరెంటు కోతలతో అవస్థలు పడుతున్నారు. కార్యాలయాలలో కరెంటు లేకపోవడంతో ఆన్‌లైన్ పనిచేయక పనులు కుంటుపడుతున్నాయి. ట్రాన్స్‌కో సిబ్బంది అనధికారిక కరెంటు కోతలు పెట్టడం వల్ల కార్యాలయాల్లో పనులు నిలిచిపోతున్నాయని అధికారులు సైతం వాపోతున్నారు. గాలి దుమారం వచ్చినా ఉరుములు, మెరుపులు వచ్చిన అకాల వర్షం కురిసిన కరెంటు సరఫరా నిలిచిపోతుంది. ఒక్కోసారి చీటికి మాటికి కరెంటు వస్తుపోతుండడంతో లైట్ బుగ్గలు కాలిపోవడం ఫ్యాన్లు చెడిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గాలి దుమారం కారణంగా కరెంటు సరఫరా నిలిచిపోతే అరగంట నుంచి గంట వరకు విద్యుత్ సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో అప్రకటిత కరెంటు కోతలు విధించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కరడ్‌పల్లి - మోతె రోడ్డు



ఫొటో న్యూస్

కరడ్‌పల్లి - గుర్జాల్ రోడ్డు

బాబోయ్.. నడిచేదెలా?

- అధ్వానంగా గ్రామీణ ప్రాంతాల రోడ్లు
- పట్టించుకోని పంచాయితీ రాజ్ అధికారులు

తాడ్వాయి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరడ్‌పల్లి మోతే రోడ్డు అధ్వానంగా తయారైంది. 2006-07 లో అప్పటి నిజామాబాద్ జిల్లా చైర్మన్ కాటిపల్లి వెంకట్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మట్టి రోడ్డు పోయించారు. ఆ తర్వాత పట్టించుకున్న నాథుడే లేదు. వర్షాకాలంలో రోడ్డుపై నడవాలంటేనే ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. కరడ్‌పల్లి నుంచి మోతే గ్రామం మీదుగా ఎల్లారెడ్డి ప్రధాన రహదారి ఈ రోడ్డు కలుస్తుంది. కరడ్‌పల్లి నుంచి గుర్జాల్ వరకు కూడా రోడ్డు గుంతలమయంగా మారింది. కరడ్‌పల్లి, జివాడి వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. యేటా గ్రామస్థులు అందరూ కలిసి ఎంతో కొంత డబ్బును పోగేసుకొని వర్షాకాలంలో మొరం పోయించుకుంటుంటారు. మండలంలోని చందాపూర్ కన్కల్ రోడ్డు పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది. 20 యేళ్ల క్రితం వేసిన రోడ్డు ఇప్పటికి అలానే ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కరేడ్పల్లి జువ్వాడి రోడ్డు కూడా అధ్వానంగా తయారైందని ప్రయాణికులు అంటున్నారు. కరేడ్పల్లి నుంచి గురుజాల్ వెళ్లే రోడ్డు కూడా ధ్వంసమైందని రైతులు అంటున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఈ రోడ్లపై దృష్టి పెట్టి బాగు చేయించాలని ఆయా గ్రామాల రైతులు , ప్రజలు కోరుతున్నారు.



కరడ్‌పల్లి - జువ్వాడి రోడ్డు

సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకం

● కలెక్టర్లతో వీసీలో మంత్రుల స్పష్టీకరణ

సుభాష్‌నగర్, జూలై 22: (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పథకాల అమలు పురోగతిని సమీక్షించారు.

ప్రతి రైతుకూ ఎకరాకు ఐదు బస్తాల యూరియా ఇవ్వాలి

● అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్

సుభాష్‌నగర్, జూలై 22:(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ప్రతిరైతుకూ ఎకరాకు ఐదు బస్తాల యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లాల కమిటీ కార్యవర్గం పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి దేవారం, ప్రభాకర్ జిల్లా అధ్యక్షుడు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాజన్న గారి బాబన్నలు మాట్లాడుతూ.. ఒకవైపు రాష్ట్ర మంత్రులు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ రాష్ట్రంలో యూరియా ఏమాత్రం లోటు లేదని రైతులకు సరిపడా ఇస్తున్నామని ముఖ్యమంత్రి సైతం యూరియా గురించి దిగులు పడవద్దని తెగ ప్రచారం చేస్తున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో దీనికి భిన్నంగా ఉందన్నారు. కిలోమీటర్ల దూరంలో సహకార సంఘాల వద్ద నిలబడి కేంద్రాల వద్ద చెప్పులు, బస్తాలు తెల్లవారు జామునే పెట్టి లైన్లో నిలబడతావున్నారని అన్నారు. వెంటనే ఎకరాన ఐదు సంచులు యూరియా ప్రతి రైతుకు ఇవ్వాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నిజాం అరాచకాలకు ఎదురొడ్డి గర్జించిన మహా కవి దాశరథి

నిజామాబాద్ కల్చరల్ జూలై 22 : (ఆంధ్రజ్యోతి) భారతదేశ మొత్తం స్వాతంత్రోద్యమ పోరాటంలో ఉన్న సమయంలో తెలంగాణ ప్రాంతంలో నిజాం అరాచకాలకు ఎదురుగా నిలబడి నైజాం దుర్మార్గాలను ప్రజలకు తన కలంతో వివరించిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని కందకుర్తి యాదవ రావు అన్నారు. దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని కోట గల్లీలో గల ఇతిహాస సంకలన సమితి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి సభా కార్యక్రమంలో దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీనియర్ చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవ రావు ముఖ్య వక్త హాజరై మాట్లాడుతూ.. నైజాం దుర్మార్గపు పాలన మీద ప్రశ్నించిన వారిని మరియు ప్రజలను చైతన్యం చేస్తున్న వారిని గుర్తించి చిత్రహింసలకు గురి చేయడమే ఏకైక లక్ష్యంగా ఆనాటి నిజాం రాజులు తమ పరిపాలనను కొనసాగించాలని తొలిత దాశరథి కృష్ణమాచార్యులను వరంగల్ జైలులో బంధించి చిత్రహింసలకు గురి చేశారని తర్వాత నిజామాబాద్ జిల్లా జైలుకు మార్చి ఇక్కడ కూడా అనేక ఇబ్బందులకు గురి చేశారని అయినప్పటికీ దాశరథి వెనక్కి తగ్గకుండా జైలు గోడల మీద సైతం బొగ్గుతో తన కవితలు రాసి సమాజాన్ని చైతన్యం చేశారని గుర్తు చేశారు. సంస్థ జిల్లా అధ్యక్షులు కలువ కోట నరేష్ రావు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాధ్యక్షులు చిలుముల మోహన్ దాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందకుర్తి ఆనంద్, జిల్లా కార్యదర్శి డాక్టర్ మర్రిపల్లి భూపతి, రాజేష్, మిలింద్, కరణం రామారావు, తాటి వీరేశం పాల్గొన్నారు

డిజిటల్ రికార్డుల ఆధారంగా రుణాలు మంజూరు చేయాలి

సుభాష్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు డిజిటల్ రికార్డుల ఆధారంగా రుణాలు మంజూరు చేయాలని అన్ని బ్యాంకులకు సూచించామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల మంజూరు కోసం బ్యాంకులు రైతుల పట్టాదార్ పాస్ బుక్కులను తమ వద్ద అట్టి పెట్టుకోవాల్సిన అవసరం లేదని, పాస్‌బుక్ పేరుతో దరఖాస్తుదారులకు రుణాలను తిరస్కరించకూడదని అన్నారు. భూ భారతి చట్టం -2025 లోని సెక్షన్ 10(6) సెక్షన్ 10(7)ల ప్రకారం, భూములపై రుణాలను మంజూరు చేసే సందర్భంలో భూ హక్కుల రికార్డులను ఉపయోగించి రుణాలను ప్రాసెస్ చేయాలన్నారు. రుణాల కోసం బ్యాంకులు రైతులకు సంబంధించిన పట్టా పాస్‌బుక్ 8కమ్8 టైటిల్ డీడ్‌ను తమ వద్ద ఉంచుకోవాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను అత్యవసరంగా పరిగణిస్తూ, వెంటనే అమలు చేయాలని బ్యాంకర్లకు ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు

అంబేద్కర్ యూనివర్సిటీలో నూతన కోర్సులు

సుభాష్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నూతన కోర్సులు ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.. 202526 కు సంబంధించిన అడ్మిషన్ల పై అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరంలో పీజీలో ఎమ్మెస్సీ బాటనీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ జువాలజీ, కోర్సులో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం నుంచి స్టైపండును అందిస్తుందని తెలిపారు.. అంతేకాకుండా అత్యంత వెనుకబడిన వర్గాలైన కోయా గోండ్లు, ఎరుకల, ట్రాన్స్ జెండర్లకు ఉచిత విద్య అందిస్తున్నట్లు ఆర్సీసీ కోఆర్డినేటర్ రంజిత తెలిపారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధికి ఉద్దేశించిన వివిధ కోర్సులలో రెగ్యులర్ విద్యను అభ్యసించలేని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆన్లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల సీఓఈ భరతరాజు తెలిపారు. ఈ సమావేశంలో అకాడమిక్ కోఆర్డినేటర్ వహీదా బేగం. అడిషనల్ కంట్రోలర్ వినయ్ కుమార్. రాహుల్ ఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఇందల్వాయిలో బోనాల సంబురం

ఇందల్వాయి జూలై 22:(ఆంధ్రజ్యోతి)తెలంగాణ సంస్కృతిని బోనాల పండుగను మొదటిసారి ప్రిన్సిపాల్ రమేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఇందల్వాయి మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు అమ్మవారుగా, పోతురాజులుగా వేషాలు వేశారు, మహిళా టీచర్లు బోనాలు ఎత్తారు. అమ్మవారికి బోనాలు సమర్పించి బోనాల విశిష్టతను, తెలియజేసే సాంస్కృతిక, ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు మరియు బోధన, బోధనేతర సిబ్బంది అందరూ పాల్గొని ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

● రాష్ట్ర జేఏసీ జాయింట్ డిప్యూటీ సెక్రెటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి

సుభాష్‌నగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ సర్కిల్ కార్యాలయం వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇందులో ముఖ్యఅతిథిగా రాష్ట్ర జేఏసీ జాయింట్ డిప్యూటీ సెక్రెటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌లు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు పనిచేస్తున్నటువంటి 19600 మంది ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని ఒకే సంస్థలు అమలు చేయాలని కోరారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేనేజ్మెంట్ విద్యుత్ సంస్థల పని చేస్తున్నా ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయాలి కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వానికి గాని మేనేజ్మెంట్ గాని ఎలాంటి ఆర్థిక భారం పడదని వారు కోరారు. విద్యా అర్హత బట్టి పదోన్నతలు కల్పించాలి లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

» కార్యకర్తల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సిరికొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుంచి కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పిలుపునిచ్చారు. సిరికొండలో మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశానికి దినేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదట ఎంపీటీసీ ఎన్నికలు జరిగినా.. సర్పంచ్ ఎన్నిలు జరిగినా బీజేపీ మద్దతు దారులను ప్రజలు గెలిపించుతారని అన్నారు. జిల్లాలో ఇప్పటికే పార్టీ సర్వే చేయించిందని అన్ని సర్వేల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతారని తేలిందని దినేష్ కులాచారి అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నక్కా రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, మండల ప్రధాన కార్యదర్శులు బాబురావు, మహేందర్ పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దినేష్ కులాచారి

ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలి..

ఇందలవాయి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సమష్టిగా పని చేయాలని, ఎవరికి సీటు వచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ అన్నారు. మండలంలోని గౌడ సంఘం బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి మండలంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ అన్ని పదవులను బీజేపీ కైవసం చేసుకొని మండలంలో పార్టీ జెండాను ఎగరవేయాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, మోదీ చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, కాంగ్రెస్, చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదని అదే బాటలో కాంగ్రెస్ నడుస్తుందని కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తోడుదొంగలనీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రభుత్వ నిధులనీ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఎప్పుడూ ఎన్నికలు వచ్చిన బీజేపీ నేతలు సిద్ధంగా ఉండల న్నారు మండలం లోని పలు గ్రామాలకు చెందిన 20 మంది కార్యకర్తలు దినేష్ ఆధ్వర్యం లో బీజేపీ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ,కుంట మోహన్ రెడ్డి,కన్నె చిన్ని, శ్రీనివాస్, డి పి రెడ్డి, వాసు,ఉప్పు సరిత, కర్కా గంగారెడ్డి, శేఖర్ బీజేపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సుద్దపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని రూరల్ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్ తెలిపారు. అనంతరం ఏసీపీ రాజవెంకటరెడ్డి, డిచ్‌పల్లి ఎస్సైకి ఫిర్యాదు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్, షకీల్ అహ్మద్, సుద్దపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ దిష్టిబొమ్మ దహనం

డిచ్‌పల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్ విద్యార్థిపై ఆ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ నాయకుడు అత్యాచారం చేయడం దారుణమని ఈ విషయంలో నిందితుడిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్‌యూఐ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థిపై అత్యాచారం చేసిన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చారీ, సుమిత్, అనిల్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

సిరికొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల రైతాంగానికి సాగునీరు అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఆధ్వర్యంలో బీజేపీ మండల నాయకులు తహసీల్దార్ రవీందర్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. మండల రైతాంగానికి గత ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీపడి సాగునీటిని అందిస్తామని హామీలు గుప్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిపోతున్నా నేటికి సాగునీటిని అందించడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, నక్క రాజేశ్వర్, రామస్వామి, రాజేశ్వర్‌రెడ్డి, బాబురావు, మహేందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

సుభాష్‌నగర్. జూలై 22: (ఆంధ్రజ్యోతి) నగరంలోని ఐటీఐ కళాశాల మైదానంలో నూడా చైర్మన్ కేశవేణు వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా కేశ వేణు వాకింగ్ చేస్తున్న వారితో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం వాకింగ్ అసోసియేషన్ సభ్యులు నుడా చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకింగ్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు

బీఆర్ఎస్ కార్యాలయంలో దాశరథి జయంతి

సుభాష్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దాశరథి జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.. పార్టీ కార్యాలయంలో దాశరథి చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో శ్రీశ్రీ రాసిన కవితలు ప్రేరణగానే ఉద్యమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిర్పరాజు తెలంగాణ శంకర్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ కల్చరల్, జూలై 22:(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తిరుమల పుణ్యక్షేత్రం మరింత అభివృద్ధి సాధించనుందని అన్నారు. లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు అందించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు ముఖ్యంగా తెలంగాణ నుంచి ప్రజా ప్రతినిధులు సిఫార్సు చేసిన లేఖలకు ప్రత్యేక దర్శనం వసతి గృహం కల్పిస్తున్న టీటీడీ బోర్డుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏడుకొండల వెంకన్న స్వామి వారి ఆశీర్వాదంతో తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు దేశ ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. స్వామిని దర్శించుకున్నవారిలో మంచాల జ్ఞానేందర్, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు ధన్ పాల్ శ్రీనివాస్, కొంజేర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర హాకీ అకాడమీకి తూంపల్లి విద్యార్థి

సిరికొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర హాకీ అకాడమీకి మండలంలోని తూంపల్లి విద్యార్థి జశ్వంత్ ఎంపికయ్యారని పీడీ సడక్ నాగేష్ తెలిపారు. జూన్ నెలలో వనపర్తిలో సాట్ అకాడమీ నిర్వహించిన ఎంపిక పోటీలో జశ్వంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర అకాడమీకి ఎంపికైనట్లు నాగేష్ తెలిపారు. దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి జశ్వంత్ ఎదగాలని మండల విద్యాశాఖ అధికారి రాములు కోరారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మనోహర్, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కార్యదర్శి రమణ విద్యార్థి జశ్వంత్‌ను అభినందించారు.

ఎల్ఈడీ లైట్ల వితరణ

సిరికొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూషీర్‌నగర్ గల క్రీడా ప్రాంగణానికి ఎల్ఈడీ లైట్లను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఆదేశాలతో మూషీర్‌నగర్ గ్రామంలో యువకులు ఏర్పాటు చేసుకున్న క్రీడా ప్రాంగణానికి ఎల్ఈడీ లైట్లతో పాటు వాలీబాల్ కిట్లను భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఇందులో యువజన కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు మహేందర్, సంతోష్‌నాయక్, మోహన్ నాయక్, జగన్, రాజు తదితరులు ఉన్నారు.

తండాలో కొనసాగుతున్న వైద్య శిబిరం

మోపాల్ జూలై22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కాల్పోల్ తండాలో వైద్య ఆరోగ్య శిబిరం మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఇటీవల ఈ తండావాసులు డెంగ్యూ జ్వరంతో మంచం పట్టిన విషయం అందరికీ తెలిసిందే. ఈ వ్యాధితో సుమారుగా 30 మందికి జ్వరాలు రావడంతో గిరిజనులు తండాను వదిలేసి నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీశారు నగరంలో ఉన్న వివిధ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది హుటాహుటిన తండా సందర్శించి అక్కడ ప్రత్యేక విద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతున్న గిరిజనులకు అన్ని పరీక్షలు చేసి కావాల్సిన మందులను అందజేశారు. ఈ తాండాను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి డిఎమ్ హెచ్ ఓ రాజశ్రీ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత అధికారులు సందర్శించారు. గిరిజనులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

» లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉంచాలి
» వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి
» వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
» వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి సాధించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఎల్ఆర్ఎస్ అంశాలపై కలెక్టర్ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వార్డు ఆఫీసర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీవోలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో లబ్ధిదారుల వివరాలను రెండు రోజుల్లోగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సుముఖంగా లేని లబ్దిదారుల నుండి లిఖిత పూర్వకంగా లేఖలు తీసుకోవాలని, వారి స్థానంలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు జాబితా రూపొందించాలని సూచించారు. అలాగే వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కలెక్టర్ తెలిపారు. వర్షాల కోసం ఎదురు చూడకుండా నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, అన్ని నివాస ప్రాంతాలలో ఫాగింగ్ చేయించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు సత్వరమే ప్రొసీడింగ్ పత్రాలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

భోజనం రుచికరంగా ఉంటుందా?

(ఐదో పేజీ తరువాయి)

పాఠశాలలోని ఓ గదిలో భద్రపరచిన పర్యావరణం పుస్తకాలను తెప్పించి అప్పటికప్పుడు తన సమక్షంలోనే విద్యార్థులకు పంపిణీ చేయించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటోందా? అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. విద్యను ఆయుధంగా మల్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్ఫూర్తి నింపారు. విద్యార్థి దశలో కష్టపడితే జీవితాంతం సుఖపడవచ్చని, కుటుంబ తలరాతను మార్చగలిగే శక్తి విద్యకే ఉందని పేర్కొన్నారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని సమయం వృధా చేయకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని, సెల్ ఫోన్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే డిచ్‌పల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ భోజనంపై అడిగి తెలుసుకున్నారు

‘తెలంగాణ’ పిలుస్తోంది..

(ఐదో పేజీ తరువాయి)

సైన్స్, ఎంఏ తెలుగు (సౌత్ క్యాంపస్), ఎంఏ హిస్టరీ, ఎంఏ ఎకనామిక్స్ కోర్సులు ఉన్నాయి. రెగ్యూలర్ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంది. తెలంగాణ విశ్వవిద్యాలయంలో మరిన్ని కోర్సులు రానున్నాయి. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సుల పట్ల వర్సిటీ నుంచి నివేదిక అందజేశారు. వర్సిటీ పరిధిలోకి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పీజీ కళాశాలలు వచ్చేవిధంగా చొరవ చూపాలని కోరారు. త్వరలో వర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాలను కూడా కేటాయించే అవకాశాలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో తెలంగాణ వర్సిటీ ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోంది.

అన్నదాత చూపు ఆకాశం వైపు

(ఐదో పేజీ తరువాయి)



పంటల సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాల నేపథ్యంలో ఇప్పటి వరకు 4లక్షల 31వేల 947 ఎకరాల్లో పంటల సాగు పూర్తయ్యింది. మొత్తం పంటల సాగులో ఇది 76 శాతం కాగా ఇంకా 24 శాతం పంటల సాగు పూర్తి కావాల్సి ఉంది. వానాకాలంలో మొత్తం 4లక్షల 12వేల 164 ఎకరాల్లో వరిసాగు అవుతుందనే అంచనా ఉండగా ఇప్పటి వరకు 3లక్షల26వేల 226 ఎకరాల్లో పంట వేయడం పూర్తయ్యింది. ఇంకా 85వేల 938 ఎకరాల్లో పంట వేయాల్సి ఉంది. మొక్కజొన్న 37వేల 633 ఎకరాల్లో సాగు అంచనా కాగా ఇప్పటి వరకు 47వేల ఎకరాల్లో పంట వేశారు. సోయాబిన్ 56వేల ఎకరాల్లో సాగు అంచనా కాగా ఇప్పటి వరకు 32వేల ఎకరాల్లో పంట వేశారు. పసుపు పంట సాగు 25వేల ఎకరాల సాగు అంచనా కాగా ఇప్పటి వరకు 23వేలకు పైగా సాగు పూర్తయ్యింది. ఇతర ఆరుతడి పంటల సాగు 29వేల ఎకరాల్లో సాగు అంచనా కాగా ఇప్పటి వరకు 24వేలకు పైగా ఎకరాల్లో పంటల సాగు పూర్తయ్యింది.

జూలై నెల పైనే ఆశలు..

మే నెలలో కురిసిన ముందస్తు వర్షాలతో జిల్లాలో పంటల సాగు 66 శాతం వరకు పూర్తి కాగా ఇంకా 34 శాతం పంటల సాగు ఏ విధంగా సాగుతుందోనన్న ఆందోళన రైతాంగంలో ఉంది. వానాకాలంలో జిల్లాలో ముఖ్యంగా వరి ప్రధాన పంటగా ఉండగా మొక్కజొన్న, సోయాబిన్, పసుపు, కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. జూన్ నెలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోగా జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఇంకా పంటల సాగు ప్రారంభం కాలేదు. అనేక చోట్ల దుక్కులు పూర్తయి వరినారు సిద్ధంగా ఉన్న భారీ వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. గత ఏడాది జూన్ నెలలో 148.8 మిల్లీమీటర్ల వర్షం పడగా జూలై నెలలో 290.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈసారి కూడా జూలై నెలలో వర్షాలు కురిసి పంటల సాగు సవ్యంగా సాగుతుందని జిల్లా రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.220	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.230	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.99,800	రూ.92,230	రూ.1175

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సూపర్ మ్యాన్ (11.00, 7.55)
: ఎఫ్-1 ది మూవీ (1.50)
: జురాసిక్ వరల్డ్ (ఇంగ్లీష్) (5.05)
: జూనియర్ (10.45)
స్క్రీన్-2 : సైయ్యారా (హిందీ) (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్క్రీన్-3 : జూనియర్ (11.00, 2.10, 7.30)
: స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (5.20)
: క్వోవాట్ యు డిడ్ లాస్ట్ సమ్మర్ (ఇంగ్లీష్ (10.40)
స్క్రీన్-4 : స్మర్ఫ్స్ (ఇంగ్లీష్) (11.35)
: మై బేబి (1.45, 7.20)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (4.40, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : జూనియర్ (1.30, 4.30, 7.20, 10.00)
స్క్రీన్-2 : జూనియర్ (11.00)
: కొత్తపల్లిలో ఒకప్పుడు (1.50, 4.40, 10.30)
: మై బేబి (7.30)
స్క్రీన్-3 : కొత్తపల్లిలో ఒకప్పుడు (11.00, 7.30)
: మై బేబి (1.30)
: సూపర్ మ్యాన్ (4.30, 10.20)

దేవి: జూనియర్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏం మాయ చేసావే (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : మై బేబి (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: కొత్తపల్లిలో ఒకప్పుడు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్